ఆదిత్య అమెరికా నుంచి వచ్చాడు. ముప్పై రోజులు సెలవు పెట్టాడు జాబ్‌కి. సంబంధాలు చూడాలి, పెళ్లి చేసుకోవాలి, అమెరికా వెళ్లి పోవాలి. అన్నీ ముప్పై రోజుల్లోనే.

ఆదిత్య టైమ్ లిమిట్ పెట్టేసరికి సీతారామయ్య, సత్యవతి బెంబేలెత్తిపోయారు. కొడుకు అమెరికాలోనే ఏ తెల్లతోలు పిల్లనో లవ్వాడేసి కొంపముంచుతాడని భయపడుతూ వున్నారు ఇన్నాళ్లూ. అయితే అటువంటి ప్రమాదం జరగలేదని



# బద్దిమోపు

వూపిరి పీల్చుకున్నారు.

'అమ్మాయి అందంగా వుండాలి. బి.టెక్కో, యం.టెక్కో చేసి వుండాలి. వాళ్ల కుటుంబం వివరాలు, కుల గోత్రాలు, కట్న కానుకలు వంటివి మీరే చూసుకోవాలి! అని చెప్పేసాడు ఆదిత్య.

సీతారామయ్య మేరెజి బ్యూరోలలో పిల్లల అల్బమ్స్ చూస్తూను, పేపర్లో వేసిన ప్రకటనకి వచ్చిన అప్లికేషన్లు, ఫొటోలూ స్క్రూటినీ చేస్తూనూ బిజీ అయ్యాడు.

అమెరికా కుర్రాడంటే ఆడపిల్లల తల్లిదండ్రులు ఎగిరిగంతేసే పరిస్థితులేం ఇప్పుడులేవు. పైగా 'అతగాడు అక్కడ ఆల్రెడీ ఎవర్నయినా పెళ్లి చేసుకుని వున్నాడా? డేటింగ్ అంటూ ఏ యూరోపియన్ అమ్మాయితోనైనా తిరుగుతున్నాడేమో? అసలు అతగాడికి జాబ్ అంటూ వుందా? లేక ఏ పెట్రోలు బంకులోనో, సూపర్ మార్కెట్లోనో గంటకింతని సంపాదిస్తున్నాడా?' అంటూ సవాలక్ష అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.

'అమ్మో! అమెరికా అల్లుడా? వద్దుబాబూ! ఆ మధ్య గోవిందరావుగారి అమ్మాయి కథ విన్నాంగదా! ఏభై లక్షల కట్నం తీసుకుని, అమెరికా వెళ్లాక కట్నం చాలలేదని తన్ని తగలేసాడు. అసలు సంగతేమిటంటే ఆల్రెడీ అతగాడికి పెళ్లయిపోయిందట. ఆ కేసు చుట్టూ తిరుగుతోంది పాపం ఆ అమ్మాయి. ఇటువంటి కథలు ఎన్ని చదవడం లేదూ పేపర్లో!' అని కొందరు భయపడుతున్నారు.

'ఆc ఏం అమెరికా సంబంధం లెద్దురూ! ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకి ఇక్కడ కూడా ఏభై, అరవై వేలు జీతం ఇస్తున్నారు. అమ్మాయి ఇక్కడే దర్జాగా వుండగలుగుతుంది. అక్కడ ఎన్ని డాలర్లు సంపాదించినా ఇంట్లో పని చెయ్యడానికి పనిమనుషులే దొరకరంట. అంట్లుతోముకోవడం, బట్టలు వుతుక్కోవడం వగైరాలన్నీ ఎవరికి వాళ్లు చేసుకోవాల్సిందేనంట. ఎందుకొచ్చిన గొడవ. ఇండియా సంబంధమైతేనే అమ్మాయినిస్తాం' అని కొందరు డిసైడైపోయారు.

కొడుకు పెళ్ళిచేయాలని రంగంలోకి దిగిన సీతారామయ్య అమెరికా కుర్రాళ్లకి మార్కెట్ పడిపోయిందని తెలుసుకుని నీరసపడి పోయాడు.

ముప్పై రోజుల్లో సంబంధం కుదురుతుందా? పెళ్లి జరుగుతుందా? అని దిగులు కలిగింది.

అప్పుడే పదిహేను రోజులు గడిచి పోయాయి.

ఒక రోజు సీతారామయ్య కొలీగ్ జీవన్

**వాణిశ్రీ**

కుమార్ ఫోన్ చేసాడు.

"మీ వాడికి సంబంధాలు చూస్తున్నారటగా! మా కాలనీలో ధనకుల సత్యనారాయణ అని వున్నాడు. మీ కేస్టే. వాళ్లమ్మాయి బి.టెక్. ప్యాసైంది. ఫొటో పంపమంటావా? ఫెయిర్‌గా వుంటుంది" అన్నాడు.

"ఫొటో పంపడం అదీ ఎందుకు టైమ్ వేస్ట్. ఈవెనింగ్ నేను, మీ చెల్లాయి వస్తాం. డైరెక్టుగా పిల్లని చూస్తాం. నచ్చితే వెంటనే పెళ్లే" అన్నాడు సీతారామయ్య.

"వెరీ గుడ్. ఐతే వచ్చేయండి" అన్నాడు కుమార్.

"నువ్వు, అమ్మ చూసి రండి. నచ్చితే రేపు అక్క, బావలతో కలిసి వెళ్తా" అన్నాడు ఆదిత్య హడావుడిగా ఎక్కడికో వెళ్తూ.

* * *

సీతారామయ్య భాగ్యనగర్ కాలనీకి వెళ్లాడు. జీవన్‌కుమార్ వాళ్లని ధనకుల సత్యనారాయణ ఇంటికి తీసుకెళ్ళాడు.

ఆ కాలనీ చాలా బిజీగా వుంది. ఎక్కడ చూసినా బంగారు నగల కొట్లు, బట్టల షాపులు... రోడ్లన్నీ కూరలు, పళ్లు అమ్మేవాళ్లు ఆక్రమించేసుకున్నారు. కారు కదలడమే కష్టంగా వుంది.

"ఏమిటింత బిజీగావుంది మీ కాలనీ?" అడిగాడు సీతారామయ్య.

"మెయిన్ రోడ్డుకి ఆనుకుని వుంది కాలనీ. మెయిన్ రోడ్డు నుంచి లోపలకు మరికొన్ని కాలనీలు వెలిసాయి. అదీ డిమాండ్. ప్రస్తుతం ఇక్కడ గజం ఏభైవేలు. నేను అప్పుడెప్పుడో ఎనిమిది రూపాయలకు కొన్నాను" అన్నాడు కుమార్.

అమ్మాయి బాగానే వుంది. సత్యనారాయణ ఆరొందల గజాల్లో మూడంతస్తుల మేడ కట్టుకుని వున్నాడు. క్రింద తను కాపురం వుండి, పైన అద్దెకు ఇచ్చాడు. ఆరొందల గజాల స్థలం అంటే మూడు కోట్లన్న మాట అనుకుని బోలెడు ఆశ్చర్యపడిపోయాడు సీతారామయ్య.

సత్యవతి ఫార్మల్‌గా ఏవో రెండు ప్రశ్నలు అడిగింది. సీతారామయ్య "అమ్మాయి బాగానే వుందిలే" అన్నాడు భార్యతో.


"మాకు అమ్మాయి నచ్చింది. రేపు మావాడు, అమ్మాయి, అల్లుడు, మా అమ్మగారూ వస్తారు. మా వాళ్లంతా ఓ.కె. అంటే వెంటనే పెళ్లి" అన్నాడు సీతారామయ్య.

"అది సరే! కట్నం సంగతి ఏమిటి? అదీ ఒక మాట అనుకోవాలిగా!" అన్నాడు జీవన్ కుమార్.

"మా వాడికి కట్నం అంటే పెద్దగా ఇష్టం లేదు అన్నయ్యగారూ! కట్నం గురించి ఆలోచించకండి. అమ్మాయికి చదువు, సంస్కారం, మంచి కుటుంబంలో పెంపకం ఇటువంటివి చూడమని చెప్పాడు" అన్నది సత్యవతి.

సీతారామయ్య భార్యవైపు గుర్రుగా చూసాడు. తన కొడుక్కి ఇంత కట్నం ఇచ్చారని చెప్పుకోవాలని ఆశ.

ధనకుల సత్యనారాయణ నవ్వి, "నాకు అమ్మాయి, అబ్బాయి ఇద్దరే సంతానం. క్యాష్ కావాలంటే కోటి రూపాయిలిస్తాను. ఆస్తి కావాలంటే ఈ కాలనీలోనే ఆరొందల గజాల ఫ్లాట్ వుంది. బిల్డర్ ఫిఫ్టీ ఫిఫ్టీ డెవలప్‌మెంట్‌కి అడుగుతున్నాడు. మనకి పది ఫ్లాట్స్ వస్తాయి. మీకు తెలుసుగా ఫ్లాట్ ముప్ఫయ్ లక్షలు పైగా చేస్తుంది" అన్నాడు.




"చూద్దాం. అబ్బాయి ఏమంటాడో?" అని అంతా సెలవు తీసుకుని బయల్దేరారు.

"ఇంతకీ ఈ సత్యనారాయణ బిజినెస్ ఏమిటి? రియల్ ఎస్టేటా?" కారులో కూర్చున్నాక అడిగాడు సీతారామయ్య.

"అదేం లేదు... ఉద్యోగమే" అన్నాడు కుమార్.

"ఉద్యోగం చేస్తూనే అంత సంపాదించాడా? మాటలు కోట్లు దాటుతున్నాయి?" అడిగాడు సీతారామయ్య.

"ఆc... అది బంగారు బాతుగుడ్లు పెట్టే వుద్యోగం"

"ఏం ఉద్యోగం?"

"రిజిస్ట్రార్ ఆఫీసులో అటెండర్."

"ఆc" అని నోరు తెరిచాడు సీతారామయ్య.

"కలిసొచ్చే రోజొస్తే నడిచొచ్చే కొడుకు పుడతాడని, రిజిస్ట్రార్ ఆఫీసుల్లో నోట్ల కట్టలు నడిచొస్తున్నాయ్. అటెండరే ఇంత సంపాదిస్తూంటే ఆఫీసర్లు ఎంత సంపాదిస్తున్నారంటావా? ఏమోమరి? మనం లెక్కల్లో పూర్" అని నవ్వాడు జీవన్‌కుమార్.

ఇంటికి వెళ్లిన తర్వాత అందరూ అమ్మాయి ఫొటో చూశారు. పిల్ల తండ్రి అటెండరనీ, లంచాలు తీసుకుని కోట్లు సంపాదించాడనీ, దేశంలో అంతా లంచాల రాజ్యం నడుస్తున్నదనీ, అధికారం సంపాదించిన వాడికే డబ్బు కుప్పలు చేరుతున్నాయనీ మాట్లాడుకున్నారు.

మర్నాడు అంతా అమ్మాయిని చూడడానికి బయల్దేరారు. సీతారామయ్య, సత్యవతి తాము మళ్లీ ఎందుకు చూడ్డం, మీరు వెళ్ళి చూడండని కొడుకుని, కూతుర్ని, అల్లుణ్నీ రెడీ చేసారు.

ఆదిత్య అక్కా, బావలతో కారెక్కాడు.

"నాయనమ్మ ఏదీ?" అన్నాడు ఆదిత్య.

"అవునూ! అత్తగారు కారెక్కలేదా? వుండండి పిలుచుకొస్తాను" అని ఇంట్లోకి వెళ్లింది

సత్యవతి.

సీతామహాలక్ష్మి తన రూమ్‌లో కూర్చుని ఏదో పుస్తకం చదువుతోంది.

"అత్తయ్యా! వాళ్లంతా మీ కోసం చూస్తున్నారు... బయల్దేరండి" అన్నది సత్యవతి.

"నేను వెళ్లనమ్మాయ్!" అన్నది సీతామహాలక్ష్మి.

"అదేంటి అత్తయ్యా?" విస్తుపోయింది సత్యవతి.

"అవునమ్మాయ్! ఈ సంబంధం నాకు ఇష్టం లేదు" చెప్పింది సీతామహాలక్ష్మి.

సత్యవతి బిత్తరపోయింది. ఆమె పుస్తకంలో నుంచి తల తిప్పటం లేదు. ఈ సంబంధం ఎందుకు ఇష్టంలేదు? ఏమిటి సంగతి? అని అడిగే ధైర్యం ఆమెకు లేదు. 'అదేదో ఆయనే చూసుకుంటార్లే' అని అక్కడ్నుంచి వెళ్లిపోయింది సత్యవతి.

"ఏమిటే అమ్మేది?" అన్నాడు సీతారామయ్య విసుగ్గా.

"మీ అమ్మగారు రారటండీ"

"ఏం?"

"ఏమో? ఈ సంబంధం అవిడకు ఇష్టం లేదట".

సీతారామయ్య బుర్ర గోక్కున్నాడు. ఏదో బలమైన కారణం వుంటేగానీ ఆమె ఏ విషయానికైనా అడ్డు చెప్పదని అతనికి తెలుసు.

గబ గబా కారు దగ్గరకెళ్ళి "ఆదిత్యా! మీ నాయనమ్మ ఈ సంబంధం వద్దంటోంది. ఎందుకో ఏమిటో నువ్వే వెళ్లి కనుక్కో" అన్నాడు.

ఆదిత్య కారు దిగెళ్ళి "నాయనమ్మా! ఏంటి సంగతి? ఈ సంబంధం వద్దన్నావట? అమ్మాయి నీకు నచ్చలేదా?" అన్నాడు పక్కనే కూర్చుని.

"అమ్మాయి అందచందాలు, వాళ్ల ఆస్తులూ కాదురా సంబంధం కలుపుకునేటప్పుడు చూడాల్సింది. పెళ్లి సంబంధం చూసేటప్పుడు అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలూ చూడమన్నారు పెద్దలు. పెద్దల మాట చద్దిమూట."

"అదిసరే! ఈసంబంధం సంగతి ఏమిటి?"

"అదేరా చెప్పబోతున్నాను. పిల్ల తండ్రి వుద్యోగం ఏదైనా, లంచాలు తెగమేసి సంపాదించాడు. నడమంత్రపు సిరి వచ్చిన వాళ్ల మనస్తత్వం విపరీతంగా వుంటుంది. తమంత అదృష్టవంతులు ఈ ప్రపంచంలో లేరని విర్రవీగుతుంటారు. వాళ్లని ఆ పాడు డబ్బు నడిపిస్తూంటుంది. పెద్దలను బట్టే పిల్లలూను. రేపు పెళ్లయ్యాక ఆ పిల్ల నిన్ను పురుగుని చూసినట్లు చూస్తుంది. మా ఆస్తి ముందు మీదెంత అంటుంది?

ఆదిత్య నాయనమ్మ వైపు ఆశ్చర్యంగా చూసాడు.

"మనిషి బతకడానికి ఎంత డబ్బు కావాలిరా? కోట్లు కావాలా? అందుకని మీ నాన్నలా కట్నాల మోజులోపడి ఏదొక పిల్లను కట్టుకోకు. సంప్రదాయం, మంచి కుటుంబంలో పెరిగిన పిల్ల బీదవాళ్లయినా ఫర్వాలేదు. అటువంటి సంబంధం దొరికేవరకూ ఆగు. అమెరికా ఎగిరిపోవాలని ఆతృతపడిపోయి జీవితంలో మన శ్శాంతి కోల్పోకు" చెప్పింది సీతామహాలక్ష్మి.

"నువ్వు చెప్పినట్లే వింటానే నాయనమ్మా!" అని ఆదిత్య ప్రేమగా ఆమె చుట్టూ చేతులు వేసాడు.

సీతామహాలక్ష్మి మనవడి బుగ్గమీద ముద్దు పెట్టింది "నువ్వు నా బంగారు" అంటూ. ●